ప్రజాశక్తి

మంగళవారం 29 జులై 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉచిత గ్యాస్



• అందరికీ అందని రాయితీ • ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత వంటగ్యాస్ సిలిండర్ పథకం జిల్లాలో ఆశించిన స్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదు. అర్హత కలిగి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వారికి అందాల్సిన రాయితీ సొమ్ము (మొత్తం గ్యాస్ సిలిండర్ సొమ్ము) అందరికీ బ్యాంకులో జమ కావడం లేదు. పథకం ప్రవేశపెట్టిన మొదటి విడత 2024 డిసెంబర్ నుంచి మార్చి వరకు వంటగ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వారందరికీ రాయితీ సొమ్ము కొంత జాప్యం జరిగినప్పటికీ, జమ అయింది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై 31వ తేదీ వరకు రెండో విడత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వారికి మాత్రం రాయితీ సొమ్ము వెంట వెంటనే జమ కావడం లేదు. కొందరికి 2, 3 రోజుల వ్యవధిలోనే రాయితీ సొమ్ము బ్యాంకులో జమ అవుతుండగా, అనేకమందికి వారం, పది రోజులు పడుతోంది. అయితే వంట గ్యాస్ బుక్ చేసుకుని వారాలు గడుస్తున్నా రాయితీ సొమ్ము జమ కాక అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. రెండో విడతలో వంటగ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని, రాయితీ సొమ్ము అందక ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారమే 4,385గా ఉంది. వీరందరికీ రూ.37 లక్షలా 34 వేలు జమ కావలసి ఉంది. దీంతో వీరంతా గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక సమస్యలు కారణంగా గ్యాస్ రాయితీ సొమ్ము జమ కావడం లేదని, త్వరలోనే జమ అవుతాయని గ్యాస్ ఏజెన్సీలు చెబుతూ పంపిస్తున్నాయి.

రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందే గడువు మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఆగస్టు ఒకటి నుంచి నవంబర్ 30వ తేదీ వరకు మూడవ విడత ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పొందే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. రెండో విడత ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పొందే అవకాశం త్వరలోనే ముగుస్తున్నందున, అర్హత కలిగిన వారు వెంటనే గ్యాస్ బుక్ చేసుకోవాలని అంటున్నారు. జిల్లాలో మూడు గ్యాస్ సంస్థల నుంచి రెండో విడతకు సంబంధించి 3 లక్షలా 65 వేలా 91 మందికి గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. వీరిలో రాయితీ అర్హత కలిగిన 3 లక్షలా 52 వేలా 379 మందికి రూ.29 కోట్లా 44 లక్షలు విడుదల అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా 4,385 మందికి రాయితీ నిధులు రావాల్సి ఉంది.

వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుని రాయితీ సొమ్ము జమ కాని వారిలో కొందరు తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటికి వస్తున్న నాయకులను రాయితీ సొమ్ముపై ప్రజలు నిలదీస్తున్నారు. త్వరలోనే రాయితీ సొమ్ము వస్తుందని, ఆందోళన అవసరం లేదని, బ్యాంకులకు వెళ్లి తెలుసుకోవాలని టిడిపి నాయకులు చెబుతున్నారు. అదే సందర్భంలో వైసిపి వార్డు వారిగా చేపట్టిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నప్పటికీ డబ్బు జమ కావడం లేదని, సూపర్ సిక్స్ పథకాలు అమలు కావడం లేదని ఆరోపిస్తూ ప్రచారం చేస్తున్నారు.

2 రోజుల్లో పి-4 మార్గదర్శుల మ్యాపింగ్

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

రెండు రోజుల్లో పి-4 మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులకు నిర్దేశించారు. పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సేవకులు, ఇతర వ్యాపార కార్యకాలాపాల నిర్వహించే వారిని గుర్తించి బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేయాలని చెప్పారు. సమాజంలో ఎగువ స్థాయిలో ఉన్న వారంతా, దిగువ స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని, తగిన సహకారం అందించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ముందుగా అధికారులతో సమీక్షించారు. గతంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, పరిష్కార తీరు గురించి ఆరా తీశారు. నివేదికలను బేరీజు వేస్తూ అధికారులు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ప్రజలు సంతృప్తి చెందే విధంగా అధికారులు వ్యవహరించాలని, ఫిర్యాదులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. రోజుకో గంట పిజిఆర్ఎస్ కోసం కేటాయించాలన్నారు. కలెక్టర్‌తో పాటు జెసి కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

▶ వార్త మెయిన్‌లో..

ప్రజల అంగీకారం లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించొద్దు : మంత్రి గొట్టిపాటి

▶ వార్త మెయిన్‌లో..

ఆర్ఆర్.ప్యాకేజీ రూ.25 లక్షలు చెల్లించాలి
వంటా వార్పుతో భూ నిర్వాసితుల నిరసన

▶ వార్త మెయిన్ లో..

'భోగాపురం' రహదారులు పూర్తి చేయాలి

విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

బృహత్ ప్రణాళిక ప్రకారం భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం విఎంఆర్‌డిఎ కార్యాలయం సమావేశమందిరంలో రహదారుల నిర్మాణ పనులపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్ అనుగుణంగా కొన్ని పనులు చేపట్టగా మిగిలిన రహదారుల పనులను త్వరలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ వద్దని ఆదేశించారు. మెట్రోరైలు ప్రాజెక్ట్ వివరాలను ప్రణవ్‌గోపాల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో జరిగిన ప్రజాదర్బార్‌కు పలువురు బాధితులు మాస్టర్‌ప్లాన్‌పై వినతులు సమర్పించారు. ప్రణవ్‌గోపాల్ , కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా ఫిర్యాదులను, వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా పరిశ్రమలకు లే అవుట్లను నిర్మించాలని, సబ్బవరం కోడూరును అనుసంధానించే బృహత్ ప్రణాళిక రహదారులను నిర్మించాలని పలువురు తమ వినతులు సమర్పించారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సిపిఒ శ్రీశిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీశంకర్, బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిఆర్ బాండ్లు వద్దు

అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల పాదయాత్ర

ప్రజాశక్తి - అనకాపల్లి, అచ్యుతాపురం

అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు వద్దని రహదారి నిర్వాసిత బాధితుల సంఘం ఆధ్వర్యాన సోమవారం హరిపాలెంలో పాదయాత్రను సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు ప్రారంభించారు. హరిపాలెంలో ప్రారంభమైన పాదయాత్ర తిమ్మరాజుపేట మీదుగా అనకాపల్లికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంది. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిర్వాసితులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ ఆయేషాకు వినతిపత్రం అందించారు. టిడిఆర్ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని ఆర్‌డిఒ చెప్పడంతో నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిఆర్ బాండ్లు ఇస్తే ఒక్క అంగుళం భూమి కూడా ఇవ్వమని స్పష్టం చేశారు. రోడ్డు నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు వద్దని, నగదు మాత్రమే చెల్లించాలని కోరారు. భూములు, ఇళ్లు కోల్పోతున్న చిన్న, సన్నకారు రైతులకు టిడిఆర్ బాండ్ల వల్ల ఉపయోగం ఉండదని తెలిపారు. గత ప్రభుత్వం నగదు చెల్లింపులు చేస్తానంటేనే భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధపడ్డారని వివరించారు. మార్కెట్ విలువ ప్రకారం భూములకు విలువ కట్టాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అచ్యుతాపురం మండలం హరిపాలెంలో ప్రారంభమైన పాదయాత్ర నుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ, టిడిఆర్ బాండ్లుతో నిర్వాసితులు తీవ్ర అన్యాయానికి గురవుతారన్నారు బాండ్లు తీసుకొని నష్టపోయిన పలు సంఘటనలను ఆయన వివరించారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము, కో-కన్వీనర్ కె.రామసదాశివరావు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, ఎస్.కనుమనాయుడు, కె.సోమనాయుడు, కె.బాబూరావు, కె.బాపునాయుడు, బొడ్డేడ రామ్‌కుమార్, ఎస్.బ్రహ్మాజీ, కో ఆప్షన్ జడ్‌పిటిసి సభ్యులు నర్మల కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, గండి నాయనబాబు, దేవా, బొడ్డేడ సూర్య కృష్ణ, కడారి అప్పారావు, నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

ప్లైవుడ్ కార్మికుల వేతనాలు పెంచాలి

సిఐటియు నాయకులు వై.రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కూలి రేట్ల ఒప్పందం కాలపరిమితి దాటి 5 సంవత్సరాలు గడిచినా, కొత్త కూలి రేట్ల ఒప్పందం చేయడంలో తీవ్ర కాలయాపన చేస్తున్న ప్లైవుడ్ యాజమానుల అసోసియేషన్ నిర్లక్ష్య వైఖరి అరికట్టాలని, వెంటనే కొత్త కూలీరేట్ల ఒప్పందం చేయాలని విశాఖ జిల్లా ముఠావర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో 200 మంది హమాలీలు ప్లైవుడ్ లోడింగ్ అన్ లోడింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ప్రతి రెండేళ్లకూ కూలి రేట్లు పెంచుతూ ఎగ్రిమెంట్ చేసే ఆనవాయితీ అనేక సంవత్సరాలుగా అమలవుతుందన్నారు. కొత్త ఎగ్రిమెంట్ చేయాలని కార్మికులు యజమానుల సంఘానికి కోర్కెల పత్రం ఇచ్చి వారాలు గడిచినా, యజమానుల సంఘం స్పందించడం లేదన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని, ఇంటి అద్దెలు, కరెంట్ చార్జీలు, రవాణ, పిల్లల చదువుల ఖర్చుల భారంతో హమాలీల బతుకులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే కూలి రేట్లు పెంచుతూ, కొత్త అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఠా కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.శ్రీను, ఈ.అప్పలరాజు, తాతారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో వ్యక్తి హల్‌చల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం కాన్ఫరెన్స్‌హాల్ వద్ద నిర్వహించిన పిజిఆర్ఎస్ వద్దకు వేపాడ పవన్‌కుమార్ పెట్రోల్ తీసుకొచ్చి హల్‌చల్ చేశాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. పోలీస్ సిబ్బంది అడ్డుకొని ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సైబర్ సెక్యూరిటీ సెల్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని పవన్‌కుమార్‌ను సంజయ్‌రెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. రూ.7 లక్షలకు పైగా వసూలు చేసి మోసం చాటేశాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ పవన్ పోలీసుల్ని ఆశ్రయించాడు. విచారించిన పోలీసులు సంజయ్ నుంచి కొంత మొత్తాన్ని పవన్‌కి ఇప్పటికే ఇప్పించారు. మిగతా మొత్తాన్ని త్వరలోనే తిరిగి ఇచ్చేస్తానని సంజయ్ హామీ ఇచ్చాడు. అయితే చాలారోజులవుతున్నా తనకు సొమ్ము తిరిగి ఇవ్వలేదంటూ పవన్ బలవన్మరణానికి ప్రయత్నించాడు. పోలీసులు అతనిని అడ్డుకొని త్వరలోనే సొమ్ము ఇప్పిస్తామని, లేదంటే ఫిర్యాదిస్తే సంజయ్‌రెడ్డిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కెజిహెచ్‌లో హెపటైటిస్ దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కెజిహెచ్‌లోని గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో హెపటైటిస్ స్క్రీనింగ్, టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 508 మంది హాస్పిటల్ సిబ్బంది హెపటైటిస్ బి స్క్రీనింగ్ చేసి, టీకాలు వేశారు. హెపటైటిస్ గురించి అవగాహన కల్పించారు. హెపటైటిస్ బి దాని నివారణ, ప్రాథమిక పరీక్షల ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ ప్రారంభించారు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్, డాక్టర్ డి.వంశీయాదవ్, డాక్టర్ ఎస్.శ్రీదేవి పాల్గొని టీకాలు వేశారు.

దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దళిత క్రైస్తవులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కు అని, దాన్ని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని చెప్పారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది సోమవారం వినతిపత్రం అందించారు. కాలేజీలో 1900 మంది విద్యార్థులు ఉన్నారని, అదనపు తరగతుల భవనం నిర్మాణంతో పాటు, పీజీ కోర్స్ నిమిత్తం సైన్స్‌ల్యాబ్, ఎక్విప్‌మెంట్ ఏర్పాటుచేయాలని కోరారు. త్వరలో కళాశాలలో నిర్వహించే గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్‌కు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. ప్రభుత్వ సహకారంతో గాని, సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా గాని అదనపు భవనం, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో కాలేజీలో పర్యటించి సమస్య తెలుసుకుని, పరిష్కరించే దిశగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దబ్బందలో ఉన్న టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దబ్బంద టిడ్కో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్ మాట్లాడుతూ, దబ్బందలో ఉన్న టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వీధిలైట్లు, మంచినీరు, రోడ్లు, ఆసుపత్రి, ఆటస్థలం, స్కూలు, శ్మశాన వాటిక కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అలాట్‌మెంట్ పత్రాలు ఇచ్చినప్పటికీ ఎటువంటి సౌకర్యాలూ లేక చాలామంది లబ్ధిదారులు దబ్బంద వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోపక్క అద్దె ఇంట్లో ఉంటూ అద్దె చెల్లించుకోలేక సొంతింటి కల నెరవేరక, టిడ్కో ఇళ్లకు ఇచ్చిన రుణాలు సకాలంలో చెల్లించుకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 2022 వైసిపి ప్రభుత్వం బ్యాంకు రుణం ఇప్పించి 2024 వరకు కట్టొద్దని చెప్పినా రుణం ఇచ్చినప్పటినుంచి కట్టాలని బ్యాంకు వారు డిమాండ్ చేస్తూ కట్టించు కుంటున్నారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు లబ్ధిదారులు ర్యాలీ నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను నగర మేయర్, జివిఎంసి కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.భానుప్రతాప్, పి.ఈశ్వరరావు, నారాయణ, రవణమ్మ, ఎన్.గోవిందు, నూకరత్నం, పి.శ్రీనివాసరావు, బి.శ్రీనువాసరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మథరావు, సి.ఎం.క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇపిఎస్ -95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, విశాఖ అధ్యక్షుడు రాంప్రభు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇపిఎస్ 95 పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని, భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైల్వే ప్రయాణ రాయితీ కల్పించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయవద్దని, సొంతగనులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఈటి బాబూరావు, ఎవి.త్రినాథ్, రంగా, వై.అప్పారావు, డి.విజ్ఞానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి వెంటాడుతున్న వసతి కష్టాలు..

- బిసి హాస్టల్ విద్యార్థుల అవస్థలు
- నిర్మించిన భవనాలు వేరొకరికి కేటాయింపు
- పరాయిపంచన, ఇరుకు గదిలో ఇక్కట్లు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కానరాని స్పందన



పాఠశాల ఆవరణలో ఆరు బయటే స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తి బిసి సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థులు వసతి లేమితో అవస్థలు పడుతున్నారు. ఎనిమిదేళ్లకు పైగా పరాయిపంచన, ఇరుకుగదిలో, వంట, వడ్డింపు, నిద్ర, చదువు అన్నీ ఒకేచోట కానిస్తూ నానా అగచాట్లు పడుతున్నారు. సొంత భవన నిర్మించినప్పటికీ, చివరి నిమిషంలో బిసి హాస్టల్‌కు కాకుండా ఇంటర్ విద్యార్థులకు కేటాయించడంతో వీరి కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చొరవ చూపి పెందుర్తి బిసి హాస్టల్‌కు సొంత భవనం సమకూర్చాలని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పెందుర్తిలోని బిసి సంక్షేమ బాలుర హాస్టల్‌లో ప్రస్తుతం 120మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న హాస్టల్ భవనాలు 2017కు పూర్వమే శిథిలావస్థనకు చేరుకోవడంతో అప్పటి వార్డెన్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టూ తిరిగి, సమస్యను వారికి విన్నవించి ఎట్టకేలకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. శిథిలమైన పాఠశాల భవనం స్థానే కొత్త భవనాలను కూడా నిర్మించారు అంతవరకు బిసి హాస్టల్ విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిఎంసి నిధులతో ల్యాబ్ కోసం నిర్మించిన అదనపు తరగతి గదిలో తాత్కాలిక వసతి కల్పించారు.

భవనం పూర్తయ్యాక వేరొకరికి కేటాయింపు

బిసి హాస్టల్‌కు సొంత భవనం పూర్తయ్యాక, విద్యార్థులను అక్కడికి తరలించకుండా ఇంటర్ విద్యార్థులకు ఆ భవనాలను కేటాయించారు. పోస్టు మెట్రిక్ నిధులతో భవన నిర్మాణాలు చేపట్టినందున ఉన్నత పాశాల విద్యార్థులకు కేటాయించడం కుదరదంటూ మెలిక పెట్టి, వేరొకరికి కేటాయించారు. బిసిహాస్టల్ కోసం వేరొకచోట భవనాలను నిర్మిస్తామంటూ అప్పటికి సర్దిచెపి, తర్వాత పట్టించుకోకుండా గాలికొదిలేశారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.



హాస్టల్ నిర్వహిస్తున్న పైఅంతస్తులోని పాఠశాల గది

హాస్టల్ భవనాల కోసం ఎంతో శ్రమించిన అప్పటి వార్డెన్ కూడా ఆ సమయానికి లేకపోవడంతో అడిగే నాధులే లేకుండా పోయారు. ఫలితంగా ఎనిమిదేళ్లకుపైగా వసతి సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ఇరుకు గదిలో అన్నీ ఒకేచోట...

ప్రస్తుతం బిసి హాస్టల్ నిర్వహిస్తున్న పాఠశాల తరగతి గది ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు భోజనం తయారీకి కూడా తరగతి గదినే వినియోగిస్తున్నారు. ఇక పాఠశాల విద్యార్థులకు నిర్మించిన అరకొర మరుగుదొడ్లనే హాస్టల్ విద్యార్థులు సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి, మొదటి అంతస్తులో హాస్టల్ గది ఉండడం, కిందన మరుగుదొడ్లు ఉండడంతో రాత్రి వేళ మరుగు అవసరాలకు కిందకు వెళ్లాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. అంతేకాక మరుగుదొడ్లు చుట్టూ పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో విషకీటకాలు, పాముల భయంతో అల్లాడిపోతున్నారు. ఇక ఉదయాన్నే కాలకృత్యాలు, స్నానాలు ఆరుబయటే చేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. హాస్టల్‌కు సొంత భవనాలను సమకూర్చి వసతి కష్టాలకు విముక్తి కల్పించాలని వేడుకుంటున్నారు.

కొత్త విద్యార్థులను చేర్చుకుంటే...

ఇప్పటికే బిసి హాస్టల్‌లో ప్రస్తుతమున్న విద్యార్థులంతా చాలీచాలని ఇరుకు గదిలో వసతితో ఇబ్బందులు పడుతుంటే, ఈ విద్యాసంవత్సరంలో కొత్తవారిని చేర్చుకుంటే పరిస్థితి ఏంటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగని ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉన్న కౌన్సిల్‌లో తీర్మానించి, కొత్తవారిని చేర్చుకోకుంటే పేద విద్యార్థులకు ప్రభుత్వ పరంగా హాస్టల్ సదుపాయం దూరం చేసినట్టేనని అంటున్నారు. ఈ నేపథ్యంలో సరిపడా సొంత భవనాలను సమకూర్చేంత వరకు బిసి హాస్టల్‌ను పూర్తి వసతులున్న అద్దెభవనంలోకైనా మార్చాలని కోరుతు న్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు అనేక సార్లు ఆందోళన చేపట్టినా చర్యల్లేక పోవడం విశేషం.

రహదారి, గెడ్డ కబ్జాపై చర్యలు



రోడ్డు, గెడ్డను పరిశీలిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనుక భాగంలో సర్వే నెంబర్ 307లోని జగనన్న కాలనీలో రహదారి, వర్షాధార గెడ్డవాగుపై ఆక్రమణ యత్నాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆదివారం తెల్లవారుజామున జెసిబిలతో సుమారు 60 అడుగుల విస్తీర్ణంలో గుర్తు తెలియని వ్యక్తులు మట్టిపనులు చేపట్టడంపై 'ప్రజాశక్తి' పత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. విఆర్ఓ అప్పారావు, సర్వేయర్ ధనలక్ష్మి సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అక్కడ ప్రభుత్వ రహదారితో పాటు గెడ్డవాగు ఉన్నట్లు గుర్తించారు. రహదారి, కొండ వాగుపై ఎలాంటి ఆక్రమణ జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 145 ఇళ్ల జగనన్న కాలనీలో 20 అడుగుల వెడల్పుతో రహదారి ఉంది. అక్కడే గెడ్డవాగు కూడా ఉంది. ఈ ఆక్రమణలను అధికారులు అడ్డుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లోనూ ఆక్రమణ లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆరోగ్య బీమాలో వృద్ధుల వెనుకంజ

- డాక్టర్ బ్రిజేష్ టక్కర్ బృందం అధ్యయనంలో వెల్లడి



డాక్టర్ బ్రిజేష్ టక్కర్

ప్రజాశక్తి - ఆరిలోవ :వృద్ధులకు ఆరోగ్య బీమా లేక అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డాక్టర్ బ్రిజేష్ టక్కర్ అన్నారు. ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత వైద్య పత్రిక లాన్సెట్‌లో భారత్‌లో ఇటీవల డాక్టర్ బ్రిజెష్ టక్కర్ నేతృత్వంలో నిర్వహించిన సర్వే అధ్యయన నివేదికలో వెల్లడించారు. ఈ సర్వే ద్వారా భారతదేశంలో క్యాటరాక్ట్(కంటి శుక్లాలు) శస్త్ర చికిత్సలు చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధులలో కేవలం ముగ్గురు మాత్రమే ఆరోగ్య బీమా కలిగి ఉన్నట్టు వెల్లఢించింది. ఆరోగ్య బీమా తగినంత కవరేజ్ ఉన్నప్పుడు మాత్రమే మెరుగైన శస్త్రచికిత్సలు ద్వారా దృష్టి ఫలితాలను అందించేం దుకు వీలవుతుందని తమ అధ్యయనంలో తేలిందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కవరేజీ ఉన్నప్పటికీ 80 ఏళ్ళు పైపడిన వారు బీమా తీసుకోవటంలో అశ్రద్ధ కనపరు స్తున్నట్టు స్పష్టమైందన్నారు. . ఈ అధ్యయనం ద్వారా 70 ఏళ్ళు పైపడిన సాధారణ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్న వారు దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక నాలుగు రాష్ట్రాల్లో సర్వే నిర్వహించగా 38,387 మంది రోగులలో కేవలం 16.07 శాతం మంది మాత్రమే ఏదో ఒక రకమైన బీమా కవరేజ్ కలిగి ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఈ బీమా కవరేజ్ కూడా వయస్సు పెరిగే కొలది తగ్గుతుం దన్నారు. ఇప్పటి వరకు ఉన్న బీమా విధానాలు అందుబాటులో లేనివిగా, భరించలేనివిగా, అప్రయోజనక రమైనవిగా వృద్ధులు భావిస్తున్నారు. అయుష్మాన్ వంటి ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా బీమా ప్రాధాన్యాన్ని కొంత పెంచాయన్నారు. ప్రభుత్వ బీమా పథకాలు సార్వత్రిక ఆరోగ్య కవరేజ్ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్య సమానత్వం సాధించుటలో కీలకమని తమ అధ్యయన రచయితలలో ఒకరైన డాక్టర్ రాజ్ నారాయణ్ పేర్కొన్నారు. తగినంత .మా కవరేజ్ ఉంటే సకాలంలో ఆరోగ్య సంరక్షణ పొందే అవకాశం ఉంటుందని తమ అధ్యయనం స్పష్టం చేసిందన్నారు. .

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గిడిజాల సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పెందుర్తి మండలం వేపగుంటలోని ముత్యమాంబ కాలనీకి చెందిన మామిడి ప్రదీప్ అలియాస్ పండు (26) మోటార్ సైకిల్‌పై పద్మనాభం నుండి నీలకుండిల వైపు వస్తుండగా, గిడిజాల వద్ద అతని వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మరణించాడు. ప్రదీప్ మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ బేసిస్‌పై మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అందిన సమాచారం మేరకు సిఐ వాసునాయుడు ఆదేశాలతో ఎస్ఐ శివ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జెసిబి ఆపరేటర్ దుర్మరణం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మాసిటీ ఫైర్ స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక జేసీబీ ఆపరేటర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ప్రకాశం జిల్లా మహమ్మదాపురం గ్రామానికి చెందిన కె.రామిరెడ్డి (39) ప్రస్తుతం విశాఖ జిల్లా కుర్మన్నపాలెంలో నివాసముంటున్నాడు. ఫార్మాసిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ సంస్థలో జేసీబీ ఆపరేటర్‌గా నాలుగేళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం విధులు పూర్తి చేసుకొని తన పల్సర్‌బైక్‌పై వస్తుండగా, ఫార్మాసిటీ ఫైర్ స్టేషన్ సమీపంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డుమధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును పరవాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

60 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-రోలుగుంట:ఆటోలో తరలిస్తున్న 60 కేజీల గంజాయిని పట్టుకున్నామని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ముందుగా అందిన సమాచారం మేరకు వడ్డిప జంక్షన్ వద్ద రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఆటోలో గంజాయిని గుర్తించామని చెప్పారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన సిఐ తెలిపారు.

భార్యను హింసించిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : అదనపు కట్నం కోసం భార్యను హింసించిన కేసులో భర్తకు నాలుగేళ్ల జైలు, రూ.20వేలు జరిమానావిధిస్తూ నమహిళా కోర్టు న్యాయమూర్తి వి శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు.జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో అదనంగా నాలుగు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ ఖజానారావు అందించిన వివరాలివి. ఇలా ఉన్నాయి. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దువ్వాడ ఉప్పర్ల కాలనీకి చెందిన మంగళగిరి పరదేశికి అదే ప్రాంతానికి చెందిన బాధితురాలతో 2014 ఏప్రిల్ 14న వివాహమైంది. అదనపు కట్నం కోసం నిందితుడు, అతని చెల్లి వేధించడంతోపాటు, 2016 నవంబర్ 4న, సెంట్రింగ్ రాడ్‌తో బలంగా కొట్టాడు, భర్త ఆగడాలను భరించలేక దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి వరకట్న వేధింపులకు రెండేళ్ళు, దాడిచేసి గాయపరిచినందుకు నాలుగేళ్ల సాధారణ శిక్ష, చెరో రూ. పదివేలజరిమానా విధించారు. మొత్తం జరిమానాలో బాధితురాలికి రూ.16,వేలు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసెక్యూషన్‌కు సిహెచ్ నవీన్ కుమార్, కె.రాజేష్ సహకరించారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి రిమాండ్

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఈనెల 25న బిసి గేట్ లారీ యార్డ్ సమీపంలో వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో సౌత్ ఎసిపి శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. బాబి, రవి గ్రూప్ మధ్య ఆధిపత్యం పోరులో భాగంగా సోనా సంతు అనే రౌడీషీటర్‌పై రవితో పాటు నిందితులు దాడి చేసి గాయపరిచారు. దాడికి పాల్పడిన వారిలో మొలి శివ, మీసాల రవి జాతీయ బాక్సర్‌లని తెలిపారు. అందిన ఫిర్యాదుతో సిఐ కేశవరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్, శ్రీనివాస్, సిబ్బంది దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

వైసిపి అరాచకాలపై పోరాటం

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి అరాచకాలపై జనసేన శ్రేణులు పోరాటం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె. నాగబాబు పిలుపునిచ్చారు సోమవారం సీతంపేట పార్టీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ఏవైనా లోపాలుంటే పరస్పరం చర్చించుకుని, సమన్వయంతో పరిష్కరించుకుని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పాలిస్తోందని, మరో రెండు దశాబ్దాల వరకు వైసిపి అవకాశమే లేదన్నారు. ప్రతినెలా వారం,పదిరోజులు ఉత్తరాంధ్రలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానన్నారు. త్వరలో జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభమౌతుందని, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు.కాగా నగరానికి వచ్చిన నాగబాబును జనసేన జిల్లా కార్యాలయంలో ఉత్తరం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

కూటమి మోసాలపై నిలదీయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు, వైసిపి నేతలు

ప్రజాశక్తి -సీతమ్మధార : అధికారం కోసం మోసపూరిత హామీలిచ్చి అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు ధ్వజమెత్తారు. సోమవారం జివిఎంసి 14వ వార్డులోకార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు గడిచిన ఎన్నికల్లో కూటమి అబద్ధపు హామీలను, చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు స్క్రీన్ మీద వీడియో రూపంలో ప్రదర్శించి వివరించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. వార్డు అధ్యక్షుడు బళ్ల శ్రీనివాస రావు, మంచ మల్లీశ్వరి, ముప్పల పోలారావు, జగన్నాధరెడ్డి, కోడూరి సత్యనారాయణ, రాజకుమారి, నవీన్, వెంకి ఉన్నారు.

ఆరిలోవ : హామీలను నెరవేర్చని కూటమి మోసాలపై నిలదీయాలని వైసిపి తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. 13వ వార్డు వైసిపి అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. వైసిపి తూర్పు మహిళా అధ్యక్షురాలు కె.శిరీషా, శ్రీనివాస్, సత్యాల సాగరిక, వానపల్లి ఈశ్వరరావు, బేతా దుర్గారావు, ప్రసంగి వాసు, కాకర గోవింద, వంకర బాబూరావు, పాల్గొన్నారు.

10వ వార్డులో: వైసిపి అధ్యక్షులు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ నిర్వహించారు. ఆదర్శనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఆర్.పాత్రుడు, పతివాడ వెంకటలక్ష్మీ, విక్టర్ వైదా నారాయణరావు, బొండా శ్రీను, కన్నబాబు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు కృష్ణానగర్‌లోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పిళ్లా సూరిబాబు కోరారు. ఈ కల్యాణమండపం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నాళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. దీంతో పారిశుధ్య వాహనాలలకు పార్కింగ్ మారిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, దీనికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని కోరారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- ఆనందపురం : ఏళ్లుగా గ్రామంలో ఉండని 38వ నెంబరు రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని బంటుబిల్లి వారి కల్లాలు ప్రజలు కోరారు. సోమవారం పిజిఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై సివిల్‌సప్లయి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఈనెల 9న సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీలోనూ రేషన్‌డీలర్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారే, తప్ప చర్యలు చేపట్టలేదన్నారు.

ప్రజా చైతన్యంతోనే స్మార్ట్‌మీటర్లకు అడ్డుకట్ట

• వామపక్ష ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు • పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన విస్తృత ప్రచారం



గాజువాకలో మాట్లాడుతున్న జగ్గునాయుడు



వెంకన్నపాలెంలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలకి కోరుతూ వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించారు. గాజువాక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు నాయకులు ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ, నష్టదాయకమైన స్మార్ట్ మీటర్లను పెట్టకుండా అడ్డుకునేలా వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార, విపక్షాలన్నీ అదానీ స్మార్ట్‌మీటర్లకు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో ప్రజా చైతన్యం వల్ల మాత్రమే వీటిని అడ్డుకట్ట వేయొచ్చన్నారు. విపక్షంలో ఉన్న స్మార్ట్‌మీటర్లు బిగిస్తే బద్దలుకొట్టండంటూ ప్రజలను మభ్యపెట్టిన ప్రస్తుత మంత్రి లోకేష్, కూటమినేతలు ఎగబడి బిగించాలని ఆరాటపడుతున్నారన్నారు. గతంలో చేపట్టిన విద్యుత్ ఉద్యమాల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లపైనా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి నాయకులు. కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, పైసా పెట్టుబడి లేకుండా ప్రజాధనంతోనే ప్రజలపై భారాలు వేసి దోచుకునేలా అదానీకి అండగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలుంటే, వాటిని వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, విపక్షాలు మౌనం దాల్చడం దుర్మార్గమన్నారు. సిఐటియు గాజువాక జోన్ నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, ముందస్తు రీఛార్జితో పనిచేసే స్మార్ట్‌మీటర్లుతో ఛార్జీల మోతతోపాటు, ప్రజలను అంధకారంలోకి నెట్టే చర్యలు చేపడుతున్నారని, వాటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.. సిఐటియు గాజువాక జోన్ అధ్యక్షులు డి రమణ మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్లపై సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనకు సిద్ధం కావాలన్నారు.. సిఐటియు గాజువాక జోన్ కార్యదర్శి ఎల్ బంగారు నాయుడు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు నాయకులు ఎ.లోకేశ్వరరావు, గొలగాన అప్పారావు, వార్డు నివాస అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.వి. త్రినాధస్వామి, కె.కిరీటం, ఐద్వా నాయకులు కె.సంతోషం, కెవిపిఎస్ నాయకులు సరోజినీ నాయుడు, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాలూరు లక్ష్మణస్వామి, ఎఐటియుసి నాయకులు జి ఆనంద్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు కె.వనజాక్షి, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అచ్యుతరావు, బిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పి దుర్గారావు పాల్గొన్నారు.

ములగాడ : స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ, 61వ వార్డు వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు జోన్ నాయకులు కె.పెంటారావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు, సిపిఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కె.సత్య ఆంజనేయ, సహాయ కార్యదర్శి జి రాంబాబు మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు మాటిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలతో వినియోగదారులపై అదనపు భారం వేయడంతోపాటు, ఇపుడు స్మార్ట్‌మీటర్లను నెత్తిన రుద్దాలని చూడడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు జి నరేష్, ఎ.సత్యారావు, ఎఐటియుసి నాయకులు గండి అప్పారావు, 58వ వార్డు శ్రీరామనగర్ గ్రామ అధ్యక్షులు ఎం. చిన్నారావు, 62వ వార్డు త్రినాధపురం గ్రామ ప్రధాన కార్యదర్శి పి రామారావు, ఐద్వా జోన్ అధ్యక్ష కార్యదర్శులు బి మమత, ఆర్ విమల, నిర్మల, ఎన్ఎఫ్ డబ్ల్యూఐ మహిళా సంఘం నాయకురాలు జి జయమ్మ డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ కార్యదర్శి ఎస్ వాసు, గంట దాసు, జ్ఞాన విజ్ఞాన వేదిక నాయకులు ఆర్ దేవరాజు, వార్డు నివాస్ జోన్ నాయకులు కె.నూకరాజు, తాతాజీ, పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. హుస్సేన్ పాల్గొన్నారు.



చోడవరంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

అదాని విద్యుత్ మీటర్లను అడ్డుకోవాలి

కె.కోటపాడు : ఇళ్లకు అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని సిపిఎం నాయకులు ఎర్ర దేముడు, ఈర్లే నాయుడు బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వారు మండలంలోని పోదుగుపాలెం, గొండుపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. స్మార్ట్ మీటర్లు పెడితే ప్రజలపై అధిక భారాలు పడగాయని తెలిపారు.

చోడవరం : చోడవరంచ పంచాయతీ పరిధి లక్ష్మీదేవి పేట వీధిలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎస్వీ నాయుడు బోను దేవుళ్ళు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించిన చోట ఇప్పటికే కరెంట్ బిల్లు నాలుగు రెట్లు అదనంగా వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, నూకరాజు, అప్పారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లి గ్రామంలో సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఇంటింటికి తిరిగి, కరపత్రాలు పంపిణీ చేశారు. అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్ల పేరుతో, ట్రూప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఇలా అనేక రకాల పేరుతో ప్రజల మీద విద్యుత్ భారాలు వేసి కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు. అదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, మండల కార్యదర్శి చందక మంగతాయారు, మరద దేవి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జిఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి

పాములు, కుక్కలు, పశువులతో వెటర్నరీ కార్మికుల వినూత్న ప్రదర్శన



పాములతో నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ కార్మికులు, చిత్రంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి పబ్లిక్ హెల్త్ సెక్షన్‌లో పనిచేస్తున్న వెటర్నరీ కార్మికులకు జిఓ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట పాములు, కుక్కలు, పశువులతో వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, జివిఎంసిలో 53 మంది వెటర్నరీ కార్మికులు పనిచేస్తున్నారని, వీరు పశువులు, కుక్కలు, పందులు, పాములు పట్టడం, కుక్కలకు ఎబిసి ఆపరేషన్లు చేస్తూ ప్రమాదకర విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరందరికీ జిఓ 36 ప్రకారం వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో వెటర్నరీ కార్మికులకు ఇప్పటికే జీతాలను పెంచారని, జివిఎంసిలో వెటర్నరీ కార్మికులకు సెపరేట్ సెక్షన్‌గా ఉండటంతో అమలు జరగలేదని తెలిపారు. వెటర్నరీ కార్మికులకు మలేరియా, పారిశుధ్యం కార్మికుల వలే అనారోగ్యం పాలయ్యే విధులు నిర్వహించడం వల్ల జివిఎంసి కౌన్సిల్ కూడా వీరికి జిఓ 36 అమలు చేయుటకు బడ్జెట్ శాంక్షన్‌తో పాటు తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు గత నెల 30వ తేదీన మున్సిపల్ సెక్రెటరీకి లెటర్ సమర్పించిన సందర్భంలో అక్కడే ఉన్న సిఎండిఎకి ఫైల్ పెట్టి ఆమోదించాలని ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. 53 మంది కార్మికులకు వెంటనే అప్రూవల్ చేసి, అమలు కోసం ఆప్కాస్‌కు ఆదేశాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర మేయర్, జివిఎంసి కమిషనర్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంవి.ప్రసాద్, శ్రావణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్తపాలెంలో కార్డెన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న గోపాలపట్నం పోలీసులు

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్, కొత్తపాలెం, చేపలకాలనీ, రజక కాలనీలలో గోపాలపట్నం పోలీసులు సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు ఆధ్వర్యాన పోలీసులు ఇంటింటా వెళ్లి వాహనాల రికార్డులను తనిఖీచేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అప్పలనాయుడు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించటానికి, అలాగే ప్రజల్లో అవగాహన కల్పించటానికి ఈ కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. అపరిచిత, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి సహకరించాలన్నారు.గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలతోపాటు అసాంఘిక చర్యలకు పాల్పడే వారి వివరాలను అందించి సహకరించాలని కోరారు.

ఆర్‌డిఒ ఆఫీసు వద్ద సుజల స్రవంతి నిర్వాసిత రైతుల ధర్నా

-2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని సబ్బవరం మండలం నల్ల రేగులపాలెం పంచాయితీ రెవిన్యూ పరిధిలో బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులు అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ షేక్ ఆయిషాకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు మాట్లాడుతూ సుజల స్రవంతి భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్ల రేగులపాలెం రెవిన్యూ పరిధి రైతులు ఈ భూముల్లో గత 70 సంవత్సరాలుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఉన్నా లేకపోయినా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. లేదంటే ఈ భూములు ఇచ్చేది లేదని ముక్తకంఠంతో హెచ్చరించారు. నష్టపోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టానికి అనుగుణంగా భూమికి బదులుగా మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు భూ సమీకరణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు, చట్ట ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువకు నాలుగు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించాలని, చెట్లకు కూడా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు, చేతివృత్తిదారులకు, చిరు వ్యాపారులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.నరేంద్ర కుమార్, పెతకంశెట్టి రమేష్, బుగిడి నూక అప్పారావు, గొలగాని అప్పారావు, గొలగాని లోవరాజు, ఈగల సత్యవతి, రాజాన అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసిత రైతులు



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : రావికమతం మండలం గుమ్మలపాడు గ్రామానికి చెందిన మామిడి అర్జున విశాఖపట్నం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తూ 2023 సెప్టెంబర్ 12 న మరణించారు. ఆయన కుటుంబం జాతీయ మానవ హక్కుల సంఘానికి ఆర్థిక సహాయం కోసం అర్జీ సమర్పించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశాల మేరకు అర్జున భార్య మామిడి రమణమ్మ, కుమార్తె మామిడి మౌనిక దేవిలకు రాష్ట్ర ప్రభుత్వ ఆకస్మిక సహాయ నిధి కింద రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు ఈ చెక్కును సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, కలెక్టరేట్ మేజిస్ట్రియల్ విభాగ పర్యవేక్షకులు ఎస్‌వివిఎస్ వాసు నాయుడుతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

83వ వార్డులో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 83వ వార్డ్ పరిధిలోని పని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు వైసిపి యువజన విభాగం నాయకులు జాజుల రమేష్ తెలిపారు. లక్ష్మీ దేవీపేట, వేదూరి వారి వీధిలో కొన్ని నెలలుగా పనిచేయని చేతి బోరును జీవీఎంసీ మంచినీటి సరఫరా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులు చేయించినట్లు వెల్లడించారు. అలాగే మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి ఇంటి వద్ద మోటార్ బోర్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కారం చేస్తామని ఏఈ హరీష్ హామీ ఇచ్చారని చెప్పారు. బి.ఆర్ అంబేద్కర్ స్కూల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి హెచ్‌ఎం సూర్యనారాయణ, యడ్ల రాణితో కలిసి జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఏఈ కుమార్‌తో కలిసి రమేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుద్ధ పెంటరావు, బుద్ధ భాస్కర్, కొమ్మన శంకర్, మొల్లేటి కొండలరావు, రేబాక స్వామి, సమ్మంగి కనకరావు, కటారి మహేష్, తట్ట అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ శానిటేషన్ కార్మికుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్లో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ కార్మికులను తొలగించడం అన్యాయమని ఏపీ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు పేర్కొన్నారు. 300 మంది విద్యార్థులకు ఒకరు తక్కువ వచ్చినా రెండో కార్మికురాలిని తొలగిస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి మాట్లాడుతూ గత ఆరేళ్లగా స్కూల్ పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, స్కూల్లో బాత్ రూములు శుభ్రం చేస్తూ విద్యార్థులు అనారోగ్యాలు పాలు కాకుండా చూస్తున్నారని తెలిపారు. కార్మికుల తొలగింపుతో ఉన్న కార్మికులపై పని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ శానిటేషన్ ఆయాలను తొలగిస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్కూల్ శానిటేషన్ ఆయాలందరూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద మహిళలేనని తెలిపారు. వీరు ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసినా నెలకు రూ.6000 మాత్రమే జీతం ప్రభుత్వం ఇస్తుందన్నారు. కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని, నెల నెల జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పుడు పని భారాన్ని పెంచడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 200 దాటిన ప్రతి స్కూల్లో ఇద్దరు ఆయాలని ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరీ, ఎస్‌కెబీబీ.లక్ష్మి, అమ్మాజీ, జి.వరలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి జానకి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పతంజలి విద్యార్థులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రస్థాయి యోగ పోటీలకు చోడవరం విద్యార్థులు ఎంపికయ్యారు. పరవాడ మండలం వెన్నెలపాలెంలో ఇటీవల జరిగిన అనకాపల్లి జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో చోడవరం పతంజలి యోగ శిక్షణ కేంద్రం గురువు పుల్లేటి సతీష్ వద్ద యోగ విద్యను అభ్యసిస్తున్న అభ్యాసకులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10 నుండి 14 సంవత్సరాల బాలురు విభాగంలో ఒమ్మి శ్యాంప్రసాద్ యాదవ్, 14 నుంచి 18 సంవత్సరాల బాలురు విభాగంలో పొట్నూరు పవన్ కుమార్ గోల్డ్ మెడల్స్, బ్యాక్ బెండింగ్ విభాగంలో గొంతిన లయ వర్ధన్ గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే 14 నుండి 18 సంవత్సరాల బాలికల విభాగంలో పందిరి వెన్నెలశ్రీ, 18 నుండి 28 సంవత్సరాల బాలికల విభాగంలో మళ్ల శ్రీహిత గోల్డ్ మెడల్స్ సాధించారు. 35 నుండి 45 సంవత్సరాల వయసు విభాగంలో యోగ గురువు పుల్లేటి సతీష్ గోల్డ్ మెడల్ సాధించి కాకినాడ ఆగస్టులో నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు యోగ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్ తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, అడ్వకేట్ శ్రీనివాసరావు, రెడ్డి అప్పారావు, బోగవిల్లి రవితేజ, యోగ టీచర్స్ బోగవిల్లి గణేష్, కొట్టాపు హరి కిరణ్, భరిణికల మోహన్ కుమార్, తల్లిదండ్రులు మళ్ల కళ్యాణకుమార్, ఒమ్మి కుమారి అభినందించారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి : యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనకాపల్లి డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ -2025 ఆధ్వర్యంలో పరవాడ మండలం వెన్నెలపాలెంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తుమ్మపాల అనకాపల్లి శ్రీకృష్ణ యోగా సెంటర్ అభ్యాసకులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బి.నరసింగరావు (45-55) కిలోల విభాగంలో ప్రథమ బహుమతి, బి.నాగమణి (45-55) ద్వితీయ బహుమతి, ఎ.ఇంద్రదేవి (45-55) తృతీయ బహుమతి, ఎ.ధన్య తేజస్విని (18-28) ద్వితీయ బహుమతి, వి.వాసిని(10-14) నాలుగవ బహుమతి, బి.జయశ్రీ (10-14) తృతీయ బహుమతి సాధించారు. వీరిని గ్రామ మాజీ సర్పంచ్ కర్రి బాబీ, శారదా వ్యాలీ డెవలప్మెంట్ సమితి సెక్రటరీ కర్రి జోగినాయుడు, యం.అజయ్, యన్.గణేష్, యన్.బోసుబాబు, పి.గణపతి, గ్రామ పెద్దలు అభినందించారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ ప్రధాన కార్యదర్శిగా దుర్గేష్ కుమార్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు ఎస్.దుర్గేష్ కుమార్ విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆదివారం విశాఖలో జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా సోమవారం దుర్గేష్ కుమార్ మాట్లాడుతూ విశాఖలో ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఆయుర్వేద వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు.

అత్యాచార బాధిత బాలికకు న్యాయం చేయాలి

-ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితులను శిక్షించాలి
-పోలీసులకు ఐద్వా నేతల వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం పంచాయతీ కొండెంపాలెం దాబాలో అత్యాచారానికి గురైన 13 సంవత్సరాల బాలికకు న్యాయం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు డిమాండ్ చేశారు. ఈ అత్యాచార ఘటనపై సమగ్రమైన విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మి, నారాయణ తదితరులు అచ్యుతాపురం పోలీసు స్టేషన్‌లో సిఐ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభం శుభం తెలియని బాలిక కుటుంబ పోషణ నిమిత్తం దాబాలో పనిచేస్తుండగా దాబా యజమాన కుమారుడే ఇటువంటి దారుణానికి పాల్పడడం సహింపరాని నేరమని పేర్కొన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కేసును నీరుగార్చడానికి ప్రయత్నం చేస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. నిందితులను కాపాడటానికి ప్రయత్నిస్తున్న వారిని వదిలేది లేదన్నారు.



సిఐ గణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

గిరినాగు పిల్లల సంరక్షణ

అడవిలో విడిచిపెట్టిన అటవీశాఖ, వన్య ప్రాణి సంరక్షణ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : గిరి నాగు పాముల గుడ్లు సురక్షితంగా పొదిగించి, పుట్టిన పిల్లలను అడవుల్లో విడిచిపెట్టిన అరుదైన ఘటన అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం వాలాబు గిరిజన ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ మేరకు అటవీశాఖ అనంతగిరి మండలం జీనబాడు సెక్షన్ ఆఫీసరు పి.శివ కుమార్ సోమవారం విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. వాలాబు సమీపంలో నల్లరాయి కొండకు అనుకుని ఉన్న అల్లం అచ్చియ్యమ్మకు చెందిన జీడితోటలోని ఓ గొయ్యిలో గుడ్లు పొదుగుతున్న భారీ గిరినాగు పశువులు మేపుతున్న రైతుల కంట పడింది. వారిని గమనించిన ఆ గిరినాగు వారిపై బుసలుకొట్టి కాటు వేయడానికి ప్రయత్నించగా రైతులంతా ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ విషయాన్ని అటవీశాఖ సెక్షన్ అధికారి శివ కుమార్‌కు తెలియజేశారు. రేంజర్ రాజబాబు సూచన మేరకు తూర్పు కనుమల వన్య ప్రాణి సంరక్షణ సంస్థ ప్రతినిధి కృష్ణ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే కృష్ణ, సంస్థ వ్యవస్థాపకుడు మూర్తి కంఠి మహంతి అక్కడకు చేరుకుని పామును పరిశీలించాడు. అది ఆడపామూగా గుర్తించి, దానిని ఎవరు ఏమీ అనకుండా కొన్ని రోజుల పాటు దాని కదలికల్ని గమనించాలని రైతులకు సలహా ఇచ్చారు. 15 రోజుల తరువాత ఆ పాము గొయ్యిలో గుడ్లు వదిలేసి అక్కడ నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న మూర్తి కంఠి మహంతి పాము గుడ్లకు సంరక్షణగా ఓ వలను కట్టించి ఉంచాడు. నెల రోజుల తరువాత ఆ గుడ్లన్నీ పిల్లలుగా తయారయ్యాయి. పాము పిల్లలు పుట్టిన విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న అటవీ అధికార శివ కుమార్, బీటు ఆఫీసర్ సాయి ప్రణీత్, వన్య ప్రాణి సంరక్షణ ప్రతినిధులు మూర్తి కంఠ మహంతి, కృష్ణ ప్రసాదు, మదు ఇషాక్ తదితరులు సోమవారం అక్కడకు చేరుకున్నారు. గొయ్యిలో ఉన్న 30 గిరినాగు పాము పిల్లల్ని జాగ్రత్తగా ఒక బాక్సులో వేసి, వాలాబు సమీపంలోని శంకరం రిజర్వు ఫారెస్టులో వాటిని జాగ్రత్తగా విడిచిపెట్టారు.

ప్రభుత్వ కళాశాలలో పెరిగిన ఇంటర్ ప్రవేశాలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెరిగినట్లు ప్రిన్సిపాల్ శిరీషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా తల్లికి వందనం, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్టడీమెటీరియల్ పంపిణీ, స్కూల్ బాగ్స్, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడంతో వంటి వాటి వల్ల ప్రభుత్వ కళాశాలలో గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రవేశాలు పెరిగినట్లు చెప్పారు. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 278 మంది ప్రవేశం పొందగా, ఈ విద్యా సంవత్సరంలో 370 మంది విద్యార్థుల ప్రవేశాలు పొందారని తెలిపారు. ఈ నెల 31 వరకు కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం ప్రవేశాలకు గడువు ఉందని, ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

అసంపూర్తి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు, వీరభద్రపేట గ్రామాలకు అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులు, పల్లె పండగ నిధులతో వాలాబు పంచాయతీలో పూలగరువు, రామన్నపాలెం, బుచ్చంపాలెం, బొడ్డగుమ్మి, కోనాం, కోడాపల్లి, బొర్రచింత, తుమ్మలపాలెం గ్రామాలకు సుమారుగా రూ.12 కోట్లు రోడ్లు మంజూరు చేసి పనులు చేపట్టారని తెలిపారు. చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గ్రామానికి రూ.84 లక్షలతో బిటి రోడ్డు మంజూరు చేసి ఎర్త్ వర్క్ పనులు చేశారని చెప్పారు. నేరెళ్ళపూడి, బోడిగరువు, మదన గరువు గ్రామాలకు రూ.1.90 కోట్లతో ఎన్నికల ముందు ట్రైబల్ డెవలప్‌మెంట్ నిధులతో రోడ్డు పనులు చేసి ఎర్త్ వర్క్ చేసి వదిలి పెట్టారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో అసంపూర్తిగా రోడ్ల నిర్మాణ పనులు నిలిపివేశారని తెలిపారు. ఈ రోడ్లన్నీ అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రస్తుతం వర్షాకాలంలో గిరిజనులు రాకపోకలకు, ఆసుపత్రికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 104, 108 వాహనాలు కూడా రావడానికి వీల్లేకుండా ఉండటంతో గిరిజనులకు వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి అసంపూర్తిగా వదిలి పెట్టిన రహదారులను పూర్తి చేయాలని వెంకన్న కోరారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో ఉన్న అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ వినియోగదారుల పిల్లల కొరకు రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో కేటాయించిన 50 శాతం సీట్ల అడ్మిషన్ల నిమిత్తం మంగళవారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.ఉమా శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కౌన్సెలింగ్ అధికారిగా నియమించారని, పదవ తరగతి పూర్తి చేసి, పాలిసెట్- 2025లో ర్యాంకులు పొందిన వారు మంగళవారం ఉదయం 9 గంటలకు, వారి సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని కోరారు. లక్ష లోపు ఆదాయం కలిగిన ఓసి, బీసీ విద్యార్థులకు, 2 లక్షలు లోపు ఆదాయం కలిగిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకం వర్తిస్తుందని చెప్పారు. సదరు విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డును తీసుకు రావాలన్నారు. ర్యాంకు లేని విద్యార్థులు వార్షిక ఫీజులు చెల్లించాల్సి వుంటుందని పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణకు టిడిఆర్‌లు సిద్ధం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ అనకాపల్లి చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులలో భవన యజమానులకు ఇవ్వవలసిన టిడిఆర్‌లు విషయంపై టిడిపి 84వ వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు విశాఖలోని జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్‌లో కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన జివిఎంసి కమిషనర్ టిడిఆర్‌లు రెడీగా ఉన్నాయని, రెండు రోజుల్లో భవన యజమానులకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గ టిడిపి సోషల్ మీడియా ఇన్చార్జిగా బుచ్చయ్య పేట మండలం వడ్డాదికి చెందిన తెలుగు యువత నాయకుడు శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం శ్రీరామ్మూర్తిని శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, బుచ్చయ్యపేట మండల నాయకులు దొండా గిరిబాబు, అప్పలనాయుడు అభినందించారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలని శ్రీరామ్మూర్తికి సూచించారు.

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్టణం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. వివిధ సమస్యలపై మొత్తం 427 వినతులు అందించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి అత్యధికంగా 180 ఉండగా, జివిఎంసి 54, పోలీసు 23, ఇతర విభాగాలకు చెందినవి 170 ఉన్నాయి. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ, ప్రయివేటు భూ ఆక్రమణలు, వ్యక్తిగత కార్యకలాపాల్లో అడ్డంకిగా నిలుస్తున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, తిరుపతి, విశాఖపట్టణం జిల్లాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక బాగా జరుగుతుందని, సమస్యల పరిష్కారంలో కూడా సానుకూలత ఉందని, దీనిపై అధ్యయనం చేసేందుకు తానే స్వయంగా పిజిఆర్ఎస్‌లో పాల్గొంటున్నానని మంత్రి పేర్కొన్నారు. ఇక్కడ అవలంభిస్తున్న విధానాలను చూసి మిగిలిన చోట్ల అమలు చేసేందుకు ఈ కార్యక్రమంలో భాగస్వామినయ్యానని తెలిపారు.

జివిఎంసి పిజిఆర్ఎస్‌కు 174 వినతులు

ఎంవిపి -కాలనీ : జివిఎంసిలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని విభాగాలకు సంబంధించి 174 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనరు కేతన్ గార్గ్‌తో కలిసి మేయర్ వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు.

అనకాపల్లి పిజిఆర్ఎస్‌కు 297 అర్జీలు

అనకాపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి 297 అర్జీలు అందాయి. పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు శచిదేవి, పూర్ణిమ దేవి, డిపిఒ ఈ.సందీప్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.హైమావతి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్‌పి తుహిన్ సిన్హా

ఎస్పీ కార్యాలయంలో.....

ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో 45 ఫిర్యాదులను ఎస్పీ తుహిన్ సిన్హా నేరుగా బాధితుల నుంచి తీసుకున్నారు. సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీటిలో భూ తగాదాలు 30, కుటుంబ కలహాలు 5 ఫిర్యాదులున్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బై వెంకన్న, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రాంకీని ఫార్మాసిటీ డెవలపర్‌గా తొలగించాలి

సిపిఎం, సిఐటియు నేతలు కోటేశ్వరరావు, గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : అక్రమాలకు పాల్పడుతున్న రాంకీ యాజమాన్యాన్ని పరవాడ ఫార్మాసిటీలోని డెవలపర్‌గా తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (సిడబ్ల్యుఎంపి)లో ఫార్మా ఘన వ్యర్థపదార్థాలను నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాంకీకి ఉన్న ల్యాండ్ ఫిల్ నిండిపోతే సిడబ్ల్యుఎంపిలోనే అక్రమంగా వేలాది టన్నులు వ్యర్థ పదార్థాలను నిల్వ ఉంచడం వలన సమీపంలో ఉన్న పరవాడ, తానాం గ్రామాలు మరింత కాలుష్యాన్ని గురవుతున్నాయని తెలిపారు. దీనికి తోడు రాంకీ యాజమాన్యం ఇప్పటికే సమీపంలో ఉన్న ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువు, మొల్లోడుగెడ్డల్లోకి వ్యర్థ రసాయనిక జలాలను విడుదల చేస్తుందని తెలిపారు. రాంకీ యాజమాన్యంపై ఇప్పటికే నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు కూడా వేయడం జరిగిందని తెలిపారు. ఇది విచారణలో ఉంటుండగానే రాంకీ యాజమాన్యం భరితెగించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాలుష్యనియంత్రణ మండలి అధికారులు రాంకీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినా పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి ప్రజల ప్రాణాలతో రాంకీ చెలగాటమాడుతున్నదని పేర్కొన్నారు. రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

టిడిపి ఇంటింటి ప్రచారం



కాకరపల్లిలో ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-మునగపాక : సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాకరపల్లి గ్రామంలో సోమవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ టిడిపి నేతలతో కలిసి ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, నాయకులు ఇల్లా రాజు, పెంటకోట శ్రీరామ్మూర్తి , సారిపిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాడుగుల నియోజకవర్గం టిడిపి పరిశీలకులు వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. సోమవారం మండలంలోని కె.కోటపాడు, గుండుపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, నాయకులు జూరెడ్డి రాము, వంటాకు శ్రీను, కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పద్మనాభం : రాష్ట్రంలో 25 లక్షల మంది విద్యార్థులకు అదనంగా తల్లికి వందనం పథకం అందించామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలో తునివలస గ్రామంలో సోమవారం ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో రూ.15 లక్షలతో ప్రతిపాదించిన రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన చేశారు. అనంతరం వృద్ధులకు 5 కేజీల చొప్పున ఉచిత బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో తునివలస మాజీ సర్పంచ్ ఆర్ఎస్ఎన్ మూర్తి, మండల టిడిపి నాయకులు కోరాడ రమణ, కొసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కంటుభుక్త వెంకటలక్ష్మి, ఎం.నందీశ్వరరావు, మహేష్, కురుమిన లీలావతి, నందిని, కాళ్ళ సత్యనారాయణ, పావని, ఆవాల గంగరాజు, గాడు వెంకటప్పడు, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి. నాయుడు, పాండ్రంగి అప్పలరాజు, శ్రీకాంత్ రాజు, గాడు తాతినాయుడు, మొకర అప్పలనాయుడు, ఎంపిడిఒ . విజయ్ కుమార్, తహశీల్దార్ ఆనంద్ పాల్గొన్నారు..



కె.కోటపాడు మండలంలో ...

ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో జరిగిన అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో మందులు కొనుగోలు, క్యాంటీన్, వాహన నిర్వహణ, పనుల కాంట్రాక్టు అక్రమంగా కట్టబెట్టడం వంటి వాటిలో అవినీతికి పాల్పడినట్టు పేర్కొన్నారు. అయితే 22 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని మంత్రి ప్రకటించడం చూస్తే చిరు ఉద్యోగులను బలి చేసేటట్లుగా ఉందని పేర్కొన్నారు. ఆ రోజు ఎవరైతే పాలకవర్గం, ఉన్నత అధికారులు ఉన్నారో వారికి తెలియకుండా ఏమీ జరగదని, ఈ అవినీతిలో ఉన్న పెద్ద తలకాయలు ఎవరో తేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని, వైద్య పరీక్షలు, స్కానింగ్ వంటి సౌకర్యాలు 24 గంటలు ఉండేటట్లు చూడాలని కోరారు. జిల్లా ఆసుపత్రిగా తగిన నిధులు కేటాయించి, స్పెషలిస్ట్ డాక్టర్లను, సిబ్బందిని నియమించి జిల్లా అవసరాలు తీర్చేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు.

శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



జి.వరలక్ష్మి

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే శానిటేషన్ కార్మికులకు రూ.16 వేల కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జిఒ 138 ప్రకారం పిఎఫ్ ఈఎస్ఐ కటింగ్ పోను రూ.16,000 వేతనం చెల్లించాలన్నారు. తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పనిచేస్తున్న ఈ కార్మికులకు రూ.9వేల నుండి రూ.10 వేలు వరకే జీతాలు ఇవ్వడం దారుణమన్నారు. ఇస్తున్న జీతాలు రెండు నెలలు పెండింగ్‌లో పెట్టారని, ఇలా అయితే వారు ఎలాబతుకుతారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : పశువులకు వ్యాధి నిరోధిక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్థకశాఖ విశాఖపట్నం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో జరుగుతున్న ఉచిత ఫైలేరియా వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పశు వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్బవరం ఏరియా పశు వైద్యశాల ఇంచార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు, పశు వైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ, డాక్టర్ సంధ్య, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిటీష్ సైనిక అధికారుల సమాధుల స్థలాన్ని

ఆక్రమణదారుల నుండి కాపాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో బ్రిటీషు సైనిక్ అధికారుల సమాధుల స్థలాన్ని ఆక్రమణ దారులను నుండి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో బ్రిటీషు సమాదుల స్థలంలో ఆక్రమణలను సిపిఎం బృదం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ, బ్రిటీషు సమాదుల స్థలాన్ని ఆక్రమణ చేసి, నిర్మాణాలు చేస్తుంటే కాపాడాల్సిన రెవిన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తూన్నారన్నారు. నర్సీపట్నం నగర నడిబొడ్డులో సర్వే నెంబర్ 9లో 19 సెంట్లు స్థలంలో ఆనాడు బ్రిటిష్ సమాధులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ స్మృతి చిహ్నాలను ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు కన్నెత్తి చూడకుండా పని చేస్తున్నారని విమర్శించారు. ఈ 19 సెంట్లు స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి భావితరాలకు స్వతంత్ర పోరాట స్ఫూర్తిని అందించాల్సినటువంటి ప్రభుత్వం ఆక్రమణకు గురవుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవాలని, మూడు రోజులుగా నిర్మాణాల జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోర్టులో కేసు కూడా నడుస్తున్నప్పటికీ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ అధికారులు ఎందుకు చర్య తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాలకు అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు గ్రామంలో ఇలాంటివి జరగడం బాధాకరమని, వీటిపై స్పీకర్ నోరు విప్పక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఈ ప్రదేశానికి ఆనుకుని వైన్ షాప్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటని, తక్షణమే అనుమతులను రద్దు చేసి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.



సమాధుల స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరరావు



మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న నాగజ్యోతి

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాగజ్యోతి సత్తా

ప్రజాశక్తి-రోలుగుంట:జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో బంగారు పతకాలు గెలుచుకున్న పవర్ లిఫ్టర్, క్రీడా జ్యోతి పివిఎం.నాగజ్యోతి మరోసారి తన సత్తా చాటారు. ఈ నెల 26, 27తేదీల్లో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరావతి పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పివిఎం.నాగజ్యోతి పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనబర్చి మూడు బంగారు పతకాలు సాధించారు. నాగజ్యోతి 74 కేజీల మాస్టర్స్ విభాగంలో స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ లిఫ్ట్ విభాగాలలో అద్భుత ప్రదర్శన కనబర్చి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఆమెకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ స్థులు, క్రీడాకారులు అభినందలు తెలియజేశారు.

రహదారుల పనులు పూర్తి చేయాలి

-ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో శంకరం పంచాయతీ పరిధిలో తాడివలస, గొప్పూరు, రాయపాలెం, రాజంపేట, వెలగల పాడు, కొత్తవలస, మామిడి పాలెం గిరిజన గ్రామాలకు అసంపూర్తిగా నిలిచిన రోడ్ల పనులు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన తాడివలస గెడ్డలో చేతులు ఎత్తి పెద్ద ఎత్తున సోమవారం ధర్నా చేపట్టారు.కొత్తవలస, తాడివలస,మామిడిపాలెం గెడ్డలపై మూడు బ్రిడ్జిలు నిర్మాణం చేస్తే ఏడు గ్రామాలకు చెందిన వందలాది మంది ఆదివాసీ గిరిజనులు మహిళలు ఇబ్బందులు తొలుగుతాయని ఆదివాసీ గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, కె భవాని తెలిపారు. వర్షం పడితే గెడ్డలు దాటి వెళ్ల లేక గర్భిణీలు, బాలింతలను డోలిలు కట్టి మోసుకు వస్తున్నారని తెలిపారు. గొట్టివాడ నుండి కొత్తవలస వెలగలపాడు, గొప్పువూరు, తాడి వలస మీదుగా రాయిపాలెం, రాజంపేట మీదుగా క్రిష్ణం పాలెం వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తె వందలాది మంది గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పించ వచ్చునని తెలిపారు. తాడివలస గెడ్డ దాటలేక గర్భిని స్త్రీ గెడ్డ లోనె ప్రశవించిందని తెలిపారు. వర్షకాలం వస్తే 108 ,104 వంటి సౌకర్యాలు పూర్తిగా ఉండటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టూరి అప్పారావు, గిన్నెపల్లి సన్యాసమ్మ సోమల నరసింహమూర్తి, జన్ని చిన్నారావు, సన్యాసమ్మ, సాగరి ఈశ్వరరావు అధిక సంఖ్యలో గిరిజనులు మహిళలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు



నియామక పత్రాన్ని ఇస్తున్న వర్మ

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్‌గా జయ ఆనంద్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్:అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా వసుపరి సామ్యూల్ జయ ఆనంద్‌ని నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ పాలక్ వర్మ తెలిపారు. సోమవారం నర్సీపట్నంలో అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. నూతనంగా నియమితులైన ఎస్టీ సెల్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ నవభారత్ పాల్గొన్నారు.



సమస్యను తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

సమస్యలపై 20 వినతులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డిఓ వివి రమణ ప్రజల వద్ద నుండి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ఆర్డిఓ అక్కడికక్కడే ఫోన్లో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు 20 వినతులు అందినట్లు ఆర్డిఓ కార్యాలయం సిబ్బంది తెలిపారు.

నర్సీపట్నం నాన్ స్టాప్ బస్సుల్లో ...

అలంకారప్రాయంగా టీవీలు

-అధికంగా టికెట్ ధర పెంచినా ప్రయాణికులకు కానరాని వినోదం

ప్రజాశక్తి -నర్సీపట్నం: నర్సీపట్నం నుండి విశాఖపట్నం వెళ్లే నాన్ స్టాప్ బస్సులో టీవీలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్ స్టేషన్ నుండి విశాఖపట్నం వెళ్లేందుకు దాదాపుగా రెండున్నర గంటలు సమయం పడుతుంది. ఆ సమయంలో ప్రయాణికులకు కాలక్షేపం కోసం బస్సుల్లో టీవీలు ఏర్పాటు చేశారు. కానీ అవి అలంకార ప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. నర్సీపట్నం నుంచి విశాఖపట్నం కి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8:30 వరకు 17 వరకు ట్రిప్పుల బస్‌లు నడుస్తున్నాయని సిబ్బంది తెలిపారు, వీటిలో పాతబడిన బస్సులు తోపాటు ఇటీవల కొనుగోలు చేసిన కొత్త బస్సుల్లో కూడా టీవీలు సక్రమంగా పనిచేయక పోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల టికెట్ రూ.140లకు భారీగా పెంచారు.అయినా టీవీలను వినియోగంలోకి తీసుకు రాలేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాన్‌స్టాప్ బస్‌లో పని చేయని టీవీ

మావోయిస్టులపై డ్రోన్‌లతో నిఘా

ప్రజాశక్తి-చింతపల్లి:మన్యం ప్రాంతాల్లో మావోయిస్టుల అసాంఘిక శక్తులపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అవకాశం కల్పించకూడదని చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక సీఐ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మావోయిస్టుల ప్రభావం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

ఇలా అయితే..బస్ స్టేషన్‌కు వెళ్లేది ఎలా?

-ప్రమాదకర పలకలపై వెళ్లేందుకు భయపడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి నర్సీపట్నం:నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీ ప్రాంతం ఆర్టీసీ బస్ స్టేషన్ కు వెళ్లేందుకు రెండు దారులు సక్రమంగా లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్ స్టేషన్కు వెళ్లేందుకు ఇన్ గేట్ లేదా అవుట్ గేట్ నుంచి రాకపోకలు సాగించాలి. రెండు మార్గాల్లో పలకలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. పలకలు ప్రమాద కరంగా ఉంటడంతో వాటిపై వెళ్లేందుకు ప్రయాణీకులు భయ పడుతున్నారు. ఆ పలకలపై వెళ్లడమే భయంగా మారింది.

కొంత మంది చేసేది లేక వేరే మార్గంలో బస్ స్టేషన్‌లోకి వెళుతున్నారు. దాదాపు యాడాదిన్నెర కాలంగా ఇదే పరిస్థితి నెలకొంది ఇటు ఆర్టీసీ అధికారులు గాని అటు మున్సిపాలిటీ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దులు వికలాంగులు. చిన్నారులు మహిళలు అత్యధికంగా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు,

ఈ విషయమై ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ ధీరజ్ ను వివరణ కోరగా మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, పనులు మొదలుపెట్టారని వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు.



బస్ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో అస్తవ్యస్తంగా ఉన్న పలకలు



దప్పు వాయించి నిరసన తెలుపుతున్న కోటేశ్వరరావు

క్వారీని తక్షణమే నిలుపుదల చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

-దళితుల వంటావార్పు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరులోని రైతు భూముల్లో నల్ల క్వారీని తొలగించాలని ఆరు రోజులుగా స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు నిరసన దీక్ష కొనసాగుతోంది. సోమవారం నిరసనగా వంటావార్పు చేశారు దండోరా మోగించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ, దళిత భూములకు ఆనుకొని ఉన్న 332 సర్వే నెంబర్ క్వారీని వెంటనే నిలుపుదల చేయాలని ఆరు రోజుల నుండి నిరాహార దీక్ష తెలియజేసినప్పటికీ దళిత రైతుల్ని పట్టించుకోలేదన్నారు. ఇన్ని రోజుల నుంచి బడుగు బలహీన వర్గాలైన దళితులు నిరసన దీక్ష చేపడుతున్నప్పటికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు.సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు దళిత రైతుల గోడు వినాలన్నారు.ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి నియోజకవర్గాన్ని మైనింగ్ మాఫియా చేతులలో పెట్టి బడుగు బలహీన వర్గాల భూములను పాడు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా దళితులను ఆదుకొని క్వారీని రద్దుచేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ అయ్యన్న జోక్యం చేసుకొని క్వారీని రద్దుచేయాలన్నారు.

బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు బొట్టా నాగరాజు మాట్లాడుతూ, అధికారులు వెంటనే స్పందించకుంటే పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, కెవిపిఎస్ నాయకులు చిరంజీవి, బహుజన్ నాయకులు మట్ల చంటిబాబు, బాధిత రైతులు అప్పారావు, పెంటయ్య, గణేశ, సత్తిబాబు పాల్గొన్నారు.



ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -పాయకరావుపేట: చదువులోనే కాదు క్రీడల్లో కూడా శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు ఈ నెల 25 నుండి 27 వరకూ తెలంగాణాలో జరిగిన సి.బి.ఎస్.ఈ క్లస్టర్ -VII కబడ్డీ పోటీలలో అండర్ -14, 19 విభాగాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు.సెప్టెంబర్ 13 నుండి 16 వరకూ బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎమ్. అపర్ణ, కోచ్ లక్ష్మణ్, చినరాజు అభినందించారు.

కార్మిక హక్కుల రక్షణకు ఉధృత పోరాటాలు



మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

-విశాఖలో సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు

-ఆర్‌కెఎస్‌వి.కుమార్ వెల్లడి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కార్మిక హక్కుల రక్షణకు ఉధృత పోరాటాలకు సిద్ధంకావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి సిఐటియు విశాఖ జిల్లా 13వ మహాసభల వివరాలను వెల్లడించారు. ఈ మహాసభలో గత మూడేళ్ల నుంచి నిర్వహించిన పోరాటాలను సమీక్షించామన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, 24 రోజులు పాటు అంగన్వాడీల సమ్మె, మున్సిపల్ వర్కర్స్ సమ్మె, ఆశ, మిడ్ డే మీల్స్, విఒఎ, ఆర్‌పిల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. సెవెన్ హిల్స్ కార్మికుల సమస్యలపై, పోర్టు హాస్పిటల్స్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఆందోళన, తోపుడుబండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ సమస్యలపై పోరాడామన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్సు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన పెద్ద ఎత్తున సమ్మె చేశామన్నారు.

భవిష్యత్తులో ఈ పోరాటాలను ఉధృతం చేసేలా అనేక తీర్మానాలు మహాసభలో చేశామన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విస్తృతమైన క్యాంపెయిన్ నిర్వహించాలని, స్కీమ్ వర్కర్స్ పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనాలు అమలు, ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు కోసం కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సెంటర్స్‌లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ తీర్మానాలు చేశామని తెలిపారు. మహాసభలో 26 మందితో నూతన కార్యదర్శి వర్గం, మరో 104 మందితో కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారిగా ఎస్.జ్యోతీశ్వరరావు ఎన్నికయ్యారని తెలిపారు. కార్మికుల సమస్యలతోపాటు స్మార్ట్ మీటర్ల రద్దు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 5వ తేదీన స్మార్ట్ మీటర్స్ రద్దుచేయాలని కోరుతూ, ఎపిఇపిడిసిఎల్ ఆఫీస్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

విశాఖలో సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు

సిఐటియు ఏర్పడ్డ 55 ఏళ్ల కాలంలో మొట్టమొదటిసారి విశాఖలో సిఐటియు అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1500 మంది కార్మిక నాయకులు హాజరవుతారని వివరించారు. డిసెంబర్ 4వ తేదీన లక్షలాది మందితో భారీ కార్మిక ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. మహాసభల జయప్రదానికి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సిఐటియు కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, కార్యదర్శులు పి.మణి, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై సానుకూల నిర్ణయం

-రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆగస్టు 6వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఎపిడబ్ల్యూజెఎఫ్ సంయుక్త కార్యదర్శులు నాగేశ్వరరావు, నగేష్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలం, అక్రిడిటేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చే ప్రక్రియపై క్యాబినెట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల పింఛన్లపై పదేపదే ప్రస్తావిస్తూ వస్తున్నారని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు సూచించారు. గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మోసపూరిత కాల్స్, మెసేజ్‌లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాట్సాప్‌లో కేవైసీ పేరుతో వస్తున్న కాల్స్, మెసేజ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇటువంటి కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, వాట్సాప్‌లో వచ్చిన లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.

పరిహారం పెంచే వరకూ పోరాటం

-కారిడార్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ పెంచి చెల్లించాలని, న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ హెచ్చరించారు. పరిశ్రమల ఏర్పాటులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారి కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ 25 లక్షలు ఆర్ ఆర్ ప్యాకేజీ చెల్లించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కారిడార్ నిర్వాసితులు సోమవారం వంటా- వార్పు కార్యక్రమం చేపట్టారు. మండలంలోని అమలాపురం పంచాయతీ పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు భూపోరాట కమిటీ నాయకులు నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు, వైసిపి నేత రామకృష్ణ, భూ పోరాట కమిటీ నాయకులు భూనిర్వాసితులతో కలిసి మాట్లాడారు. 5 సెంట్లు ఇంటి స్థలం, 8 లక్షల 98 వేలు రూపాయలు ప్యాకేజీ ఇస్తామని అధికారులు ప్రకటించారని దీనిని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. భూములు, ఇల్లు లను ను నిర్వాసితుల నుండి తొందరగా ఖాళీ చేయించి పరిశ్రమలకు అప్పగించాలనే ఆత్రుత తప్పా, నిర్వాసితులను ఆదుకోవాలనే ధ్యాస ఎక్కడా కనిపించలేదన్నారు. అభివబుద్ధి అంటే రైతుల దగ్గర భూములను తీసుకుని వారిని రోడ్డు పాలు చేయడమా అని ప్రశ్నించారు. చట్ట ప్రకారం జిల్లా సంప్రదింపుల కమిటీ వేసి అధికారులు నిర్వాసితులతో చర్చలు జరిపి ప్యాకేజీ నిర్ణయించాలని, జిల్లా అధికారులు నిర్వాసితులతో ఏమాత్రం చర్చలు జరపకుండా ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకుని కాలయాపన చేస్తున్నారని, సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఈ విధంగా మోసగించడం భావ్యం కాదన్నారు. నిర్వాసితులందరికీ ఆర్‌ఆర్ కార్డులు ఇవ్వాలని, ఏర్పాటు చేసే పరిశ్రమలలో శాస్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని, వివాహం అయిన ఆడపిల్లలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని, సాగు, డీ ఫారం, సాగు భూములలో గల తోటలకు పరిహారం చెల్లించాలని, బోర్ వెల్స్, బావులకు కూడా పరిహారం చెల్లించాలని, అదనపు భూసేకరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మేడేటి శంకర్, వైసీపీ నేత అయినంపూడి మణిరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, నిర్వాసితులు ఈశ్వరరావు, జీ.గోవిందరావు, వై.అప్పారావు,చిన్నమ్మ లు, రోహిణి రాణి, చరణ్, ముసలి నాయుడు, గోవిందరావు, చిన్ని , శ్రీను, పెద్ద సంఖ్యలో మహిళా నిర్వాసితులు పాల్గొన్నారు.



వంటా వార్పు చేపడుతున్న నిర్వాసితులు

ట్రైయినీ ఎస్ఐ గా సాహిబ అంజుమ్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి పోలీస్ స్టేషన్ లో ట్రైనీ ఎస్ఐగా సాహిబ అంజుమ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సీఐ కుమారస్వామిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కేసులు కు సంబంధించిన అంశాలపై సీఐ ఆమెకు అవగాహన కల్పించారు. 5 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

